# విధి వంచితులు



*** రచన : శ్రీ కోవెలకుంట్ల శ్రీరామ్ ***

జీవిత మనేది ఒక యాత్ర వంటిది. ఈ యాత్రలో మన మనేక మందితో పరిచయ మవుతుంటుంది. పరిచయ మైన ప్రతి వ్యక్తి మన హృదయాల్లో స్థానమేర్పరుచుకో లేదు. ఆ పరిచయం తాత్కాలికమే. ఏ ఒక్కరో, ఇద్దరో మనల్ని విపరీతంగా ఆకర్షిస్తారు. అలాంటి వాళ్ళే మన హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకో గలుగుతారు. అలాగే మనకు ఎన్నో. సుందర వస్తువు లీ యాత్రలో కనబడుతుంటాయి. ప్రతి వస్తువు విధిగా మనల్ని ఆకర్షిస్తుంది. సృష్టిలో ప్రతి జీవిని విధిగా ఆకర్షిస్తుంది. ఇలా ఒకదానిపై నింకోదాని ఆకర్షణ బలీయంగా వుంటు ది. ఆకర్షణ మృగ్యమైన రోజు సృష్టిలో చైతన్య మే వుండదు. వచ్చిన చిక్కేమిటంటే ఒకే అందమైన వస్తువు ఇద్దరి నాకర్షిస్తుంది. ఆ వస్తువును ఇద్దరూ వాంఛిస్తారు. పొందాలని తపిస్తారు. కాని ఆ వస్తువు లభ్య మయ్యేది ఒక్కరికే. విచిత్ర మేమంటే, ఒక్కోసారి ఆ వస్తువు ఎవరికీ లభ్యంకాకుండాకూడా పోతుంటుంది. ఇక్కడే, విధి తన సామర్థ్యాన్ని చూపిస్తుంటుంది. మానవుడు తన అసమర్థతను అంగీకరిస్తుంటాడు. అంత మాత్రాన మానవుడు తన ప్రయత్నం విరమించుకోవడం లేదు. తనదనుకున్న వస్తువు తనకు లభ్యమయితే ఇక ఆ వ్యక్తి పొందే ఆనందం చెప్పటాని కలవిగానిది. ఇక, తను పొందాలనుకున్న వస్తువు ఎదుట వానికి లభ్యమయితే పొందని వ్యక్తి మనోవేదన వర్ణించ శక్యంగాదు. 'తనకు లభించదని తెలిసిన, వాటికోసంకూడా అర్రులు చాచడం' మానవుల్లోని ఒక రకమైన బలహీనతకు నిదర్శనం. అతని విచిత్ర చిత్త ప్రవృత్తికాక తార్కాణం. ఎదుటి వాని మనోవేదన చూడలేక, వాని తృప్తికోసం తనకు లభ్యమయిన నిధిని సంతోషంగా అర్పించే వాళ్ళుబహు కొద్ది మంది వుంటారు. ఆ వస్తువును పొందటానికి అన్ని అవకాశాలుండి. ఇతరుల తృప్తికి దాన్ని త్యాగంచేయటంలో అలాంటి వ్యక్తులు ఏదో అలౌకి కానందాన్ని అనుభవిస్తుంటారు. అలాంటి వాళ్ళు ఈ లోకంలోలేరని చెప్పతాముగాని, అరుదుగా కనబడుతుంటారనేది మటుకు నిజం. రాజేంద్రకూడా ఇలాంటి కోవలోనికి చెందినవాడే. మెడిసన్ చదువుతున్న శోభను ప్రాణసమానంగా ప్రేమించాడు. శోభ అతన్ని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నది. రాజేంద్ర ఆ వూళ్ళోనే రివిన్యూ డిపార్టుమెంట్‌లో క్లర్కుగా పనిచేస్తున్నాడు. రాజేంద్ర-శోభ' ప్రేమలో మోహంలేదు. వారి ప్రేమలో నిర్మలత్వం వుంది. రెండు నిండు హృదయాలకలియక ప్రేమయని నిర్వచనం చెప్పకుంటే, వారి ప్రేమ అలాంటిదేనని చెప్పాలి. ఆ కలియకలో ఒక రసమైన మానసిక తృప్తి ఉంది. రాజేంద్ర శోభ తనకు భగవంతుడు ప్రసాదించిన వరంగా భావించుకున్నాడు. తిమిరం క్రమ్ముకున్న తన హృదిలో ఆశాజ్యోతి వెల్గింపవచ్చిన దీపకన్యే శోభ యని తలచి రాజేంద్ర పరవశుడై పోతుంటాడు.

ఆ రోజు ఆదివారం. శోభ ఇంటికి బయలుదేరాడు రాజేంద్ర.

* * * *

'శోభా!' అంటూ శోభ గదిలోకి ఆత్రంగా ప్రవేశించాడు కెమికల్ ఇంజనీర్ శంకర్.

'ఓ బావా! కులాసాగా వున్నావా? ఎప్పుడురావటం! విశేషాలేం' ఒక్కుమ్మడిగా ప్రశ్నల వర్షం కురిపించింది అప్యాయంగా శోభ. సోభ ప్రశ్న లన్నింటికి ఓపికగా సమాధానాలిచ్చాడు శంకర్.

'శోభా! ప్రభుత్వం పై చదువులకు నన్ను అమెరికా పంపుటకు నిశ్చయించింది. పదిరోజుల్లో నేను తిరిగి

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు !!

# మోటార్లు SRF పంపులు

రాష్ట్ర ప్రభుత్వాలు తక్కావి పద్ధతులో మా పంపులు - మోటార్లు రైతులకు ఆమోదించబడినవి.





* స్వల్ప విద్యుచ్ఛక్తితో అధికమైన మంచినీళ్లు.
* ఎక్కువకాల మన్నిక.
* శ్రేష్ఠమైన తయారి.
* ఖర్చులో తక్కువ.
* శ్రేష్ఠమైన లోహం.
* నిశ్శబ్దంగా పరుగు.

తయారించువారు

**SRI RENUKA FOUNDRY**

GANAPATHI (P.O.) :: COIMBATORE-6. *(Phone : 24730)*

మద్రాస్ వెళ్ళిపోవాలి,'_సోఫాలో కూర్చుంటూ అన్నాడు శంకరు.

'మంచి వార్త చెప్పావు. నా జోస్యం నిజమయింది కదూ? నాకేం బహుమతిస్తావో' _ ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులోపోసి శంకర్ కందిస్తూ అంది శోభ.

కాఫీ త్రాగుతూ శోభనా పాదమస్తకం పరీక్షిస్తున్నాడు శంకరు. శోభలో అందము తక్కువైనా ఆకర్షణ ఎక్కువ. ఏమంత పొడుగరికాదు మరీ పొట్టికాదు ఏమగాడ్నైనా ఆకర్షించగల నిండైన విగ్రహం కాఫీ గ్లాస్ ప్రక్కనపెట్టి. నెక్ టై కాస్త లూజ్ చేసుకున్నాడు శంకరు. శోభ దగ్గరగావచ్చాడు. 'శోభా, నీకుతగిన బహుమతి ఇవ్వటానికి మంచి అవకాశం...' అంటూ శోభ గుండ్రటి భుజాలపై చేతులువేసి దగ్గరకు తీసుకోబోయాడు శంకరు.

'ఏమిటిది బావా!_అంటూ భుజాలమీద చేతులు తీసివేసి దూరంగా జరిగింది శోభ.

'రేపో మాపో పెళ్ళిచేసుకోబోతున్నాం కదా!' శోభ కేసిచూసి మాట్లాడుతూ, మావగా సిగరెట్ ముట్టించాడు శంకర్.

'క్షమించు శంకర్. ముందర చదువు పూర్తవ్వాలి. అయినా నా కిప్పట్లో వివాహం చేసుకునే ఇష్టంకూడా లేదు.' ముక్తసరిగా అంది శోభ.

శంకరు, శోభ మాటలకు కాస్త గాభరా పడ్డాడు.

'శోభా! నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను. వాంఛిస్తున్నాను.'_దీనంగా అన్నాడు శంకరు.

'బావా! ఏ మగాడితోనైనా ఆడపిల్ల కాస్త చనువుగా వ్యవహరించి, అప్యాయంగా మాట్లాడితే ఆమె అతన్ని ప్రేమించినట్టేనా? పెళ్లి చేసుకోవటానికి సిద్ధమయినట్టేనా? అప్యాయతను ప్రేమగా భావించుకుంటారు. చనువిస్తే దాన్ని మరోరకంగా అర్థం చేసుకుంటారు. ప్రేమలో శారీరక వాంఛే నిండి నిబిడీకృతమైపోలేదు. శారీరక స్పందనతోపాటు ఒక రకమైన

ఆధ్యాత్మిక స్పందన కలిగినప్పుడే అది ప్రేమ అనిపించుకుంటుంది. అలాంటి ప్రేమలోనే మానసికమైన తృప్తి లభిస్తుంది ప్రేమికులకు. గంభీరంగా మాట్లాడింది శోభ.

శంకర్ ఏమి పలుకలేదు. శోభ మరెవ్వరినైనా ప్రేమించిందేమోనని అనుకున్నాడు. శోభా, నిన్ను ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తున్నమాట మటుకు నిజం. నీవిచ్చిన చనువును, చూపిన అప్యాయతను దుర్వినియోగం చేయలేదనే భావిస్తున్నాను. నీకు నా ప్రవర్తనవల్ల కష్టం గలిగివుంటే క్షమించు'-శంకర్ కంఠము జీరవోయింది.

సునలో మనకేమిటి క్షమాపణలు బావా! లే, నీ ఫ్రెండ్ రాజేంద్ర కీ శుభవార్త చెప్పొద్దూ.' శంకరు భుజంతట్టి లేపింది శోభ. అరగంట క్రితమే లోనికి రాబోతున్న రాజేంద్ర తమ సంభాషణంతా విని వెనుదిరిగి పోవటం శంకరు-శోభలలో ఎవ్వరు గమనించ లేదు.

శంకరు-శోభలు వచ్చేటప్పటికి రాజేంద్ర తను విన్న దాన్ని గూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. వాళ్ళ రాక గమనించనట్లులేదు. శోభా శంకరులే రాజేంద్రను పలుకరించక తప్పలేదు.

'శంకరు-ఎంత కాలానికి నిన్ను మళ్ళీ చూడగలిగాను' అంటూ శంకరు భుజంపై అప్యాయంగా నిమిరాడు రాజేంద్ర.

'సారీ, శోభా నిన్ను విష్ చేయటం మర్చిపోయాననుకోకు.'-అన్నాడు రాజేంద్ర. శోభ, రాజేంద్ర కళ్ళల్లోకి చూసినవ్వుతూ కుర్చీలో కూర్చుంది. శంకరు, శోభ కేసి పరిశీలనగా చూస్తున్నాడు.

అందరు కలసి కాఫీ త్రాగారు.

'రాజేంద్రా! శంకరు పదిరోజుల్లో అమెరికా వెళ్లుతున్నాడు, ప్రభుత్వమే పంపిస్తోంది' 'హయ్యర్ స్టడీస్ చేయటానికి...' శోభ చెప్పింది.

అదృష్టవంతుడివి శంకరు. నీ వెక్కడున్నా నీ ఉన్నతనే నేను కోరేది. అన్నాడు రాంజేంద్ర శంకరు కేసి చూస్తూ.

'ఎవరు అదృష్టవంతులో ఎవరు చెప్పగలరు రాజేంద్రా! జీవితంలో మనమెన్నో అనుకుంటాము. అనుకున్న వన్నీ పొందలేము. అలా పొందగల్గితే ఇక జీవితంలో బాధలు, కష్టాలు ఎందుకు? నాదనుకున్న వస్తువు నాకు కాకుండా దూరమయ్యేదికూడా అదృష్టమేనా?' - ఉదాసీనంగా అన్నాడు శంకరు శోభా - రాజేంద్రల ముఖాల్లో కేసి చూస్తూ.

రాజేంద్ర ముఖము వర్షపునీటి భారంచే క్రుంగిన పద్మంలా ముడుచుకుపోయింది. శోభ, శంకరు కేసి సూటిగా చూడలేక తల వాల్చేసింది.

ఆ మరుసటి రోజే శోభా - రాజేంద్రలకు వీడ్కోలు చెప్పి శంకరు మద్రాస్ బయలుదేరాడు.

* * * *

ఎవరితోనూ నిమిత్తంలేకుండా కాలచక్రం గిర్రున తిరిగిపోతున్నది. అందుకనే 'Time and tide wait for no man' అన్నారు. 'శంకరు అమెరికా వెళ్ళీ రెండేళ్లు కావస్తోంది. శోభ 'డాక్టరీ' పూర్తిచేసింది.

* * * *

రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. సాయంత్రం నుండి తీవ్రంగా కురిసిన వర్షం తగ్గుముఖం పట్టింది. చల్లటి గాలి వస్తోంది, ఆకాశా నంటిపెట్టుకున్నట్లున్న నల్లటి మేఘాలు తేలిపోతున్నాయి, కడిగిన అద్దంలావుంది ఆకాశము. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. మనసుకు త్తేజాన్ని, ఉల్లాసాన్ని కలగజేస్తోంది. గవర్నమెంట్ హాస్పిటల్లో విద్యుద్దీపాలు వింత కాంతులను వెదజల్లుతున్నాయి. పేషంట్స్ వార్డులోనుండి అప్పుడే బయటికి వచ్చిన శోభ, రజేంద్ర రాకకోసం ఎదురుచూస్తోంది. విద్యుద్దీపాల వింత వెలుగులో అందంగా మెరసిపోతూంది శోభ. ప్రతిదినం ఆఫీస్ నుండి బయలుదేరి ఆరుగంటలయ్యేసరికి హాస్పిటల్ చేరుకునే రాజేంద్ర ఎంత సేపటికి రాకపోయేసరికి శోభకు చిరాకెత్తింది. శోభ రాజేంద్ర రూం కేసి దారితీసింది. దారిలో రాజేంద్రతోడి గుమస్తా ఎదురై రాజేంద్ర తన ఉద్యోగానికి రాజీనామా చేశాడన్న వార్త శోభ చెవుల్లోవేశాడు. శోభకేమి పాలుపోలేదు. బహుశ తన కోసం ఇంటి కెళ్ళాడేమో ననుకొని ఇంటికి బయలు దేరింది శోభ ఆలోచనల బరువుతో.

శోభ గదిలో లైట్ వెల్గుతోంది. నేరుగా గదిలోకి వచ్చిచూసింది. రాజేంద్ర వచ్చినజాడలేమి కనిపించటం లేదు. ఇంతలో హఠాత్తుగా శోభ దృష్టి టేబిల్ మీదున్న కవరు పైకి వెళ్లింది. రుమీదున్న తన పేరు అంత అందంగా వ్రాయడం రాజేంద్రకు చేతనవును. వణుకుతున్న చేతులతో కవరు అందుకుని, అందులోని ఉత్తరం చదవటం మొదలెట్టింది. రాజేంద్ర ఎదురుగా నిలబడినట్లుంది శోభకు.

'శోభా! ఇలా నీకు చెప్పకుండా వెళ్ళిపోవలసి వుంటుందని ఎన్నడు అనుకోలేదు. జీవితంలో మనమెన్నో అనుకుంటాము, కొన్నియైనా నేరవేరితే తృప్తి. కొన్ని నేరవేరక పోయినా సరిపెట్టుకుంటాము. అన్నీ అనుకున్నట్టు నెరవేరవు అందుకే 'Some times things do not go according to our plans' అన్నారు. ఏమిటో, నాజీవితంలో ఏదికూడా నేను అనుకున్నట్టు జరుగలేదు. ప్రతి విషయంలోనూ తీరని ఆశాభంగమే మిగిలింది. నన్ను ఆదరించి, ప్రేమించే ప్రతి వారికి ఏదో రకంగా మనస్తాపాన్ని కల్గిస్తున్నాను. ఎవరికీ ఏవిధంగా ఉపయోగపడక పోవటం మినహాయించి. నన్ను అభిమానించేవారి మనస్సుల్లో తీరని ఆవేదనే నింపుతున్నాను. నాలాంటి నష్ట జాతకునితో పరిచయమవటం నిజంగా దురదృష్టమని చెప్పాలి. జీవితంలో చేదు, తీపి వున్నాయంటారు. చీకటి, తర్వాత తప్పక వెలుగు వస్తుందని చెప్తారు. కాని తీపి అంటే నా జీవితంలో నేను ఎన్నడు చవిచూడలేదు. తీపికూడా చేదుగానే మారిపోతుంటుంది. నా జీవితంలో నిండిన చీకటిని చీల్చేందుకు వెలుగు ప్రసరించినా అది క్షణికమే అయింది. నేను బాధపడుతూ, ఇతరులను నావలన బాధపెట్టడాని కిష్టంలేకనే ఈ నిష్క్రమణ. ఇంతటి వైరాగ్యము నన్నావరించి యుండేందుకు కారణాలు ఏమై వుంటాయోనని నీవు అడుగవచ్చు. ఈ రకపు నా జీవితానికి స్వస్తి చెప్పే ముందు నా ఎదలోనుండే ఈ బాధను నీ ముందుంచుతున్నా శోభా! నీతో ప్రత్యక్ష్యంగా హృదయం విప్పి చెప్పలేక పోయినా ఇలాగైనా తెలిపితే నాకు అదో తృప్తి.

*　　*　　*　　*

ఏపూట కాపూట జీవనాన్ని సాగించడం కష్టమయ్యే ఒక పేదకుటుంబములో పుట్టాను అమ్మ ఎలా వుంటుందో సరిగ్గా తెలియకముందే నాకు దూరమయింది. అమ్మ చని పోవటంతో నాన్నకు అన్ని రకాల వ్యసనాలు అలవాటయ్యాయి. నన్ను చూస్తేనే చిరాకు ఆయనకు, నాన్న ఎప్పుడు ఇంటికి వస్తాడో ఏమో నాకు తెలియదు. రోజు కూలీలో నా చేతులో ఒకరూపాయ పెట్టేవాడు. ఒకపూటతిని, మరోపూట పస్తుపడుకుంటూ నాన్న చీదరింపు చీకాకులమధ్య నా చిన్నతనాన్ని అలాగే దొర్లించాను. ఊళ్ళో వాళ్ళ సహాయంతో చదువు సాగించి, స్కూల్ ఫైనల్ పాసయ్యాను. నాన్న ఆరోగ్యం బాగా దెబ్బ తినింది. పట్నం వెళ్ళి ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాను. నాన్నను దక్కించుకోవాలనుకున్నాను. పట్నంలో, అప్పుడే నాకు శంకర్ తో పరిచయమయింది, శంకర్ వాళ్ళ నాన్న రాజేశ్వరరావుగారి దయవల్ల వెంటనే రివిన్యూ డిపార్ట్ మెంట్ లో ఉద్యోగం దొరికింది. ఉద్యోగం దొరకడం_నాన్న మరణించడం ఒక్కేసారి జరిగాయి. జీవితంలో ఆనందం, దుఃఖం ఒక్కేసారి లభ్యమయ్యాయి. నాకు ఏడ్చుటకు కూడా శక్తి చాల్లేదు. తండ్రి ప్రేమంటే ఏమిటో ఎరుగక పోయినా, నాన్న నన్ను అప్యాయంగా ఏనాడు దగ్గరికి తీసుకోకపోయినా నా గుండెల్లో ఏదో భరింపరాని ఆవే





Manufacturing ¾ H P. 20 H.P.—3 Phase RPM Motors 960 1450 & 2890 Monoblock set 2 H P. to 20 H P. 3 Phase ½ HP. to 2 H P.

*Dealers in Madras City:*—UNITED AGENCIES
96, Arminian Street, Madras-1
POPULAR ELECTRICALS,
329, Thambu Chetty St., Madras-1

Sole Agents for Eastwhile Hyderabad & Maharashtra State, M/s. Vijai Agencies 24, Market Road, Secundarabad-3

*Agents for Cuddopah Dt.*—
M/S. V. S. REDDY & CO.,
4/192, Dr. Ayyaswami Pillai St.,
Cuddapah (A.P.)

దన గూడుకట్టుకుంది. రక్త సంబంధమంటే అదేనేమో? ఇక నా అనేవాళ్లు నాకెవ్వరూ మిగల్లేదు. అద్దె గదిలో నుండి రాజేశ్వర్రావు గారింటికి మారిన తర్వాత నాజీవితం క్రొత్తమలుపు కలిగింది. అప్యాయత, అనురాగాలకు అర్థమంటే ఏనాడు ఎరుగని నాకు, రాజేశ్వరరావు - సరస్వతమ్మ-శంకర్‌ల అప్యాయతాభిమానాలకు ముగ్ధుడనయ్యాను. వీళ్ళందరు నాపై చూపే అభిమానం ఒక ఎత్తు. కృష్ణప్రియ, శంకర్ ఏకైక సోదరి చూపే అభిమానం ఒక ఎత్తు. కృష్ణప్రియ, శంకర్ ఏకైక సోదరి చూపే అభిమానం అనురాగం - మరోఎత్తు. వాళ్ళ కుటుంబం చూపే ప్రేమానురాగాలతో నన్ను పరవశున్ని గావించాయి. రక్తసంబంధము కంటే అసదృశ సంధము ఎంత బలవత్తరమైనదో? శంకర్ వాళ్ళ అమ్మ - నాన్నలే నాకు భగవంతుడు ప్రసాదించిన తల్లిదండ్రులుగా తలపోశాను. ఆనాడే నేను మనసారా నవ్వగలిగాను.

కాలం ఆనందంగా సాగిపోతున్నది. హఠాత్తుగా ఒకనాడు 'టైఫాయిడ్' జ్వరంతో మంచమెక్కాను. అహర్నిశలు నా దగ్గరే వుండి నాకు సకల పరిచర్యలు చేసి నన్ను మళ్ళీ మామూలు మనిషిని చేసింది కృష్ణప్రియ. ఆమె చేసిన సేవ తల్చుకుంటే నా కళ్ళు భాష్పపూరిలా తేలాయి. కృష్ణప్రియ ఋణం ఎలా తీర్చుకోవాలో నాకు తెలిసేదికాదు. వాళ్ళ ఋణం ఎలా తీర్చుకోవడమా అని ఎప్పుడూ ఆలోచిస్తుంటాను. డాక్టరిచ్చే మందులకంటే, కృష్ణప్రియ చూపుల్లోని నిర్మలత్వం - మాటల్లోని తీయదనమే నన్ను మనిషిగా చేశాయంటే ఆశ్చర్యమేమిలేదు. కృష్ణప్రియకు అనువైన సంబంధాలు వెదుక[illegible]గారు రాజేశ్వర్రావుగారు. ఇంతలో ఒక సంఘటన జరిగింది. అదే నా జీవితాన్ని కూల్చివేసింది. ఆరని అగ్నిజ్వాలలు నాలో రేపింది. నా గదిలోకి ఒంటరిగా వచ్చింది కృష్ణప్రియ. తను నన్నెంతో గాఢంగా ప్రేమిస్తున్నానని తనను పెళ్ళాడటమే, తను నాకు చేసిన సేవకు ప్రతిఫలమనింది. 'కృష్ణప్రియ కోరిక నన్ను కలవరపెట్టింది. నాకేమి దిక్కుతోచలేదు. దైవకృపవల్ల నాకు అక్కడినుండి బదిలీ జరిగింది. అది నా మంచికే జరిగిందని సంతోషించాను. దూరంగా వుంటే మనసుకు శాంతి లభిస్తుందని భావించాను. కృష్ణప్రియ మనసు మార్చుకొని నన్ను అర్థం చేసుకుంటుందనుకున్నాను.

గత 55 సంవత్సరములనుంచీ
ప్రసిద్ధి చెందినది.




మంచి ఆకుతోను, శ్రేష్ఠమైన పొగాకుతోనూ
తయారించిన
సమద్, జాడీ & సాదా
బీడీలనే వాడి, ఆనందించండి.
తయారించువారు
సమద్ బీడీ ఫేక్టరీ
వేలూరు N. A)
ఫోన్ : ఆఫీసు 246. రెసిడెన్స్ 124.
Tel: "SAMADBIDI"

భారంపైన హృదయంతో వాళ్ళకు వీడ్కోలు చెప్పి ఆ పూరు వదిలాను. ఈ వూళ్ళో నీవు పరిచయమయ్యావు. నీ సహచర్యంలో నా మనసు కాస్తా కుదుటపడింది. అలా కొన్ని దినాలు గడిచాయి.

శంకర్ నన్ను కలిసి, కృష్ణప్రియ చనిపోయినట్లు తెలిపాడు. శంకర్‌ను ఓదార్చటానికికూడా నాలో శక్తి చాల్లేదు. 'కృష్ణ' దిగులుతో శంకర్ తల్లిదండ్రులుకూడా ఈ లోకం విడిచిపెట్టారు. ఈ విషయం విన్నతర్వాత నాకు మతిపోయినట్లైంది. వాళ్ళ మరణాలకు నేనే

కారణమేమో ననిపించింది. శంకర్‌ను చూసినపుడల్లా నా మనస్సు తరుక్కుపోయేది. అతనిని ఆ స్థితికి తీసుక రావడానికి నేనే కారణమనిపించి విలపించేవాడిని. 'శోభ సహచర్యంలో ఎట్టి బాధలైనా మరచిపోతాను రాజేంద్రా' అనేవాడు శంకర్. అతడు నిన్ను ప్రేమిస్తున్నాడని తెలుసుకోగానే నాకు మతి విభ్రమణం కల్గినట్లయింది. శంకర్ సుఖాల్లో భాగం పంచుకోగలిగానే కాని కష్టాల్లో భాగస్వామి కాలేకపొయ్యాను. 'శంకర్ నిన్ను పొందలేకపోతే...' అబ్బవొద్దు శోభా! మరో ప్రాణాన్ని నేను బలిగొన్నట్లవుతుంది. ఒకవేళ నిన్ను చేపట్టినా, నా మనసుకి తృప్తికలుగదు. మనశ్శాంతి వుండదు. విషాద యానంలో చితికిన మనసు నాది. కష్టాల్లో పుట్టి కష్టాల్లో పెరిగాను. జీవితంలో చేదు చవి చూడటానికే అలవాటుపడిన ప్రాణం నాది. ఎంతటి విషాదమైనా భరించి జీవితాన్ని సాగించడం నా కలవాటైపోయింది. నా జీవితంలో కొద్దికాలమైనా అమృత ధారలు కురిపించిన శంకర్ కుటుంబాన్ని, బీటలువారిన నా ఎదలో పన్నీరు చిలికించిన నిన్ను ఎన్నడూ మరచిపోలేను.

శంకరు జీవితం ఎట్టి ఒడుదుడుకులకు లోనుగాకుండా నీవు కాపాడగలవని నాకు నమ్మకముంది. శంకరు కుటుంబానికి నష్టపరిహారంగా, శంకరును నీవు వివాహం చేసుకోవాలి. శోభా, శంకరు జీవితాన్ని శోభాయమానం చేయగలవని భావిస్తున్నాను. నా మాట మన్నించితే నాకదే ఆత్మతృప్తి.

సెలవు!

— నీ రాజేంద్ర,

ఉత్తరం చదవడం ముగించింది శోభ.

శోభ కన్నీళ్లు ఉత్తరాన్ని పూర్తిగా తడిపివేశాయి. రాజేంద్ర కోరిక చెల్లించడానికి నిశ్చయించుకుంది.

♦ ♦ ♦

శంకరు రాకకోసం నిరీక్షిస్తోంది శోభ. రాత్రి ఏడు గంటలయింది. ఏమి తోచకపోవటంతో రేడియో ఆన్ చేసింది శోభ. వార్తలు ప్రసారమవుతున్నాయి.

'ఒక ముఖ్యవార్త, మొన్న జరిగిన (న్యూయార్క్-ఢిల్లీ విమానప్రదంతో మరణించిన భారతీయులు మొత్తం ఇరవై మంది అని తెలిసింది. తీవ్రంగా గాయబడి చికిత్సకై తీసికొని వస్తున్న యువకుడు, అమెరికాలో విద్యనభ్యసించి వస్తున్న ఇంజనీర్ శ్రీ ఆర్. శంకర్ మధ్యదారిలోనే ప్రాణాలొదిలారు. ఈ విషయము తెలుపుటకు చింతిస్తున్నాము. వారి కుటుంబానికి మాగాఢ సానుభూతి'-శంకర్ మరణవార్త విన్న శోభహృదయం స్తంభించినట్లయింది. ఆమె కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరగనారంభించాయి. విరిసి పరిమళం వెదజల్లవలసిన ఆశాపుష్పాన్ని విధి బలవంతంగా కాలరాసింది.

వినువీధిన తారకలు వెలవెల బోతున్నాయి. శోభ ఆ వేదన చూడలేక చంద్రుడు నల్లటి మేఘాల చాటుకి వెళ్ళాడు. ఎదురుగా గోడకున్న ఛాయచిత్రంలో నుంచి రాజేంద్ర శోభను దీనంగా పరికిస్తున్నాడు.

(ఈ కథలోని పాత్రలు, పేర్లు, సంఘటనలు కల్పితం)

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు




♦ తక్కువ ధర
♦ చిరకాల మన్నిక
♦ చక్కని అల్లిక

*

ఇవే ఎవరెడి బనియన్ల విశిష్టత

*

ఎవరెడి నిట్టింగ్ కంపెని,
బి. ఎస్. సుందరం రోడు,
తిరుపూరు. (S.I)

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులముకాదు. —సంపాదకుడు.